క్లుప్తంగా

బాలాత్రిపుర సుందరీదేవికి విశేష పూజలు



పెన్నుల అలంకరణలో బాలాత్రిపుర సుందరీదేవి

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని బాలాత్రిపుర సుందరీదేవిని 1500 పెన్నులతో ప్రత్యేకంగా అల కరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో పట్టణానికి చెందిన గాదిరాజు శివాజీ రాజు, జ్యోతి దంపతులతో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అలంకరణ చేసిన పెన్నులను ఇంటర్ విద్యార్థులకు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, బాలాత్రిపుర సుందరి మహిళ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరామక్షేత్రంలో పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న చంద్రశేఖర్

ఉండి: వైఎస్సార్ సీపీ నాయకుడు,కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ ఉండిలో ప్రముఖ దేవాలయమైన శ్రీరామ క్షేత్రంలో శనివారం పర్యటించారు. సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గుండాబత్తుల సుబ్బారావు ఆహ్వానం మేరకు శ్రీరామక్షేత్రాన్ని దర్శించుకున్న ఆయన ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గమహంకాళి, రాయి సతీష్, శేషాద్రి శ్రీను, యేడిద నెహ్రూ పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు



కోలనపల్లి డంపింగ్ యార్డు వద్ద పనులు చేయిస్తున్న అధికారులు

కాళ్ల: మండలంలోని కొలనపల్లి గ్రామంలో ఉన్న డంపింగ్ యార్డును వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓఆర్డీ భాస్కరరావు, గ్రామ కార్యదర్శి విజయ నిర్మల తెలిపారు. లక్షల్లో వ్యయం నెర వేరని లక్ష్యం. సాక్షిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. కోలనపల్లి గ్రామంలో డంపింగ్ యార్డ్ ను ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు అధికారులు శనివారం చర్యలు చేపట్టారు. డంపింగ్ యార్డ్ వద్ద చెత్తాచెదారం తొలగించి యార్డులో ఉన్న కుండీలను వినియోగంలోకి తీసుకొస్తున్నారు.

నాటక రంగం ద్వారా సమాజంలో మార్పు



జీఎల్ఎం పురస్కారం అందుకుంటున్న శాంతారావు

పాలకొల్లు సెంట్రల్: నాటక రంగం ద్వారా సమాజంలో అనేక మార్పులు తీసుకురావచ్చని ఏపీ మానవ హక్కుల వేదిక కార్యదర్శి ఏడిద రాజేష్ అన్నారు. శుక్రవారం రాత్రి పట్టణ లయన్స్ కమ్యూనిటీ హాలులో విద్యా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో బుంగ లలితా మాధవరావు స్మారక నాటక పురస్కారం 2024 కార్యక్రమం నిర్వహించారు. ఏడిద రాజేష్ మాట్లాడుతూ పురస్కార గ్రహీత ప్రజానాట్య మండలి కళాకారులు నాటక రచయిత, దర్శకులు, శిక్షకులు కొసనం శాంతారావు గత 30 ఏళ్లుగా నాటక రంగం ద్వారా సమాజం చైతన్య పరచడానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ముందుగా కొసన శాంతారావుకకు లలితా మాధవరావు స్మారక నాటక పురస్కారంతో పాటు రూ. 20 వేలు నగదు అందించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య కార్యదర్శి పోలిశెట్టి శ్రీశ్రీ, తోలేటి గాంధీ, జవ్వాది నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామలింగేశ్వరుని పుష్పోత్సవం

యలమంచిలి: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మేడపాడు శివాలయంలో శ్రీఉమా సహిత రామలింగేశ్వరస్వామి పుష్పోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు బాదంపూడి చిరంజీవిశర్మ బ్రహ్మత్వంలో అడ్డాల వాసుదేవరావు, ఊర్మిళ ధనలక్ష్మి దంపతులు పుష్పోత్సవం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి దేవేరులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన మహిళలందరికీ గంధం వీరాస్వాములు ఆర్థిక సాయంతో పసుపు, కుంకుమ, రవిక, గాజులు, పిల్లలకు పెన్ను, పుస్తకం పంపిణీ చేశారు.

కందిపప్పు పంపిణీ లేనట్టేనా?

- రేషన్ ద్వారా పంపిణీను పట్టించుకోని ప్రభుత్వం
- మార్చి నెలకు సరఫరా కాని వైనం



మోగల్లులో ఎండీయూ వాహనం ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

పాలకోడేరు: రాష్ట్రంలో కూటమి పాలన మాటల వరకే పరిమితమైంది. ఎన్నికలకు ముందు పూర్తిస్థాయిలో రేషన్ సరుకులు ఇస్తామని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక అరకొర సరుకులతోనే చేతులు దులిపేసుకుంటున్నారు. నెలనెలా కందిపప్పు పంపిణీను తగ్గిస్తూ మార్చి నెలకు వచ్చేసరికి ఉండి నియోజవర్గంలో కందిపప్పు పంపిణీకు ఎగనామం పెట్టేశారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చినప్పటి నుంచి రేషన్ సరుకులు సక్రమంగా అందడం లేదు రేషన్ లబ్ధిదారులు చెబుతున్నారు. ఒక్కోనెలా ఒక్కో సరుకు ఎత్తేస్తూ ఈ నెల కందిపప్పు పంపిణీకు మంగల పాడేశారు. నాలుగు నెలల ముందు ఆర్భాటంగా కందిపప్పు పంపిణీ మొదలుపెట్టి నాలుగు నెలలకే చేతులెత్తేసింది. గత నెలలో కందిపప్పు అరకొరగా ఇవ్వడంతో చాలా మంది కందిపప్పు అందక అసంతృప్తి వ్యక్తం చేశారు.

40 శాతమే సరఫరా

ఉండి నియోజకవర్గలోని ఆకివీడు పాలకోడేరు ఉండి, కాళ్ల మండలాల్లో మొత్తం రేషన్ షాపులు164 ఉండగా కార్డు దారులు 87,679 మంది ఉన్నారు. కార్డుకి కిలో చెప్పున సుమారు 87 టన్నుల కందిపప్పు సరఫరా చేయాల్సి ఉంది కానీ గత నెలలో ఒక్కొఓ షాపుకి మాత్రమే 40 శాతం మాత్రమే మాత్రమే సరఫరా చేశారు దీంతో రేషన్ డిపోల ద్వారా మొదట వచ్చిన వారికి మాత్రమే కందిపప్పు అందజేసి మిగిలిన వారికి ఇవ్వలేదు. మరి కొన్ని షాపుల్లో డీలర్లు లబ్ధిదారులకు పూర్తిగా కందిపప్పు ఇవ్వలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం మార్చి నెలకు సంబంధించి కందిపప్పు పంపిణీ ఊసే లేదని కార్డుదారులు విమర్శిస్తున్నారు. మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.180 నుంచి రూ.190 వరకు ఉంది. అయితే రేషన్ షాపుల్లో కిలో కందిపప్పు రూ.67కి ఇవ్వడంతో డిమాండ్ అధికంగా ఉంది. కానీ డిమాండ్‌కు తగ్గ సరఫరాలో కూటమి ప్రభుత్వం విఫలమైంది.

బియ్యంతో సరి

ప్రతి నెలా కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న ఉచిత బియ్యం మాత్రమే అందజేస్తున్నారు. కూటమి నాయకులు ఎన్నికల్లో రేషన్ డిపోల ద్వారా అన్ని రకాల పప్పులు రాయితీ ధరలకు ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారం చేపట్టి తొమ్మిది నెలలు అయ్యిందని పండుగ కూడా చేసుకున్నారు కానీ ప్రజలకు ఇచ్చిన హామీల పై దృష్టి సారించడం లేదని పెదవి విరుస్తున్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి తనిఖీల సందర్భంగా తూకంలో తేడా ఉందన్న నెపంతో పంచదార కందిపప్పు నిల్వలను వెనక్కు పంపేశారు. అంతవరకు బాగానే ఉంది వరుసగా రెండు నెలల పాటు బియ్యం చక్కెర తప్ప మిగిలినవి ఏపీ పూర్తి స్థాయిలో ఇవ్వడం లేదు. ఒక్కో డిపోకు 500 నుంచి 800రేషన్ కార్డుల వరకు ఉన్నాయి కానీ ఒక్కో డిపోకు కందిపప్పు గత నెలలో కేవలం 150 కిలోలు ఇవ్వడంతో కార్డుదారులకు డీలర్లు సమాధానం చెప్పలేక తలలు పట్టుకున్నారు. ఈ మార్చి నెలలో అయితే కందిపప్పు రాకపోవడంతో కార్డుదారులు డీలర్లను నిలదీస్తున్నారు.

కందిపప్పు ఏదీ?



కూటమి ప్రభుత్వం రేషన్ సరుకులు పూర్తిస్థాయిలో ఇవ్వడం లేదు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ డిపోలు, ఎండీయు వాహనాల ద్వారా బియ్యంతో పాటు కందిపప్పు పంచదార ఇచ్చే వారు. గత నెలలో కొన్ని డిపోలకు మాత్రమే కందిపప్పు అరకొర ఇచ్చి ఈ నెల అసలు రాలేదని చెబుతున్నారు.

– కొండేటి లాజరు కుముదవల్లి

రేషన్ షాపుల్లో పంపిణీ చేయాలి



మార్కెట్లో నిత్యవసర సరుకులు ధరలు పెరిగిపోయాయి. అలాంటప్పుడు ప్రభుత్వం ప్రజలు ఇబ్బంది పడకూడదని చౌక దుకాణాల్లో నిత్యవసర సరుకులు తక్కువ ధరకే అందించాలి. బహిరంగ మార్కెట్లో కందిపప్పు కొనలేకపోతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం కచ్చితంగా ప్రతి నెలా కందిపప్పు అందించాలి.

– జి.కిరణ్, పాలకోడేరు

వస్తే సరఫరా చేస్తాం

ప్రస్తుతానికి ఉండి గోదాములో కందిపప్పు నిల్వలు లేవు. అందువల్ల రేషన్ షాపులకి సరఫరా జరగలేదు. ఉండి ఎంఎల్ఎస్ పాయింటు అధికారులు కందిపప్పు వస్తే పంపుతామన్నారు. గత నెలలో 40 శాతం పంపిణీ చేశాం. ఈ నెలలో ఉన్నతాధికారులు కందిపప్పు కేటాయిస్తే షాపులకు సరఫరా చేస్తాం.

– ఆదిశేషయ్య సివిల్ సప్లయిస్ డీటీ, పాలకోడేరు

మహిళా చట్టాలపై అవగాహన



భీమవరంఅర్బన్: విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ బంటుమిల్లి శ్రీనివాస్



ఆకివీడు: విద్యార్థినులకు రక్షణ వ్యవస్థపై అవగాహన కల్పిస్తున్న సీఐ జగదీశ్వరరావు

భీమవరం అర్బన్: మహిళల రక్షణ కోసం మహిళా చట్టాలు కఠినంగా ఉన్నాయని రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బంటుమిల్లి శ్రీనివాస్ అన్నారు. భీమవరంలోని రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కళాశాల విద్యార్థినులకు మహిళా చట్టాలు, ఫోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బంటుమిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆడపిల్లలు, యువతులు, మహిళలపై దాడులు, దౌర్జన్యాలు, దూషణలు, అత్యాచారాలు వంటివి చేస్తే చట్టపరంగా కఠిన శిక్షలు ఉన్నాయన్నారు. సాంకేతిక పరిజ్ఞానం మరింత అభివృద్ధి చెందిందని సంఘటనలు జరిగిన అతి తక్కువ సమయంలోనే దోషులను పట్టుకుని శిక్షించడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం మహిళ భద్రత చట్టాలు, ఫోక్సో చట్టాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎస్సై ఐ వీర్రాజు, హెడ్ కానిస్టేబుల్ పి. మహేశ్వరరావు, కానిస్టేబుల్స్, కళాశాల విద్యార్థినులు ఉన్నారు.

భీమవరం పట్టణంలో

భీమవరం (ప్రకాశంచౌక్): మహిళల సంరక్షణ పోలీసుల బాధ్యత అని, క్లిష్టమైన సమస్యలు వచ్చినప్పుడు తల్లిదండ్రులకు, శ్రేయోభిలాషులకు తెలియజేయాలని డీఎస్పీ జయసూర్య అన్నారు. భీమవరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ ఆవరణలో పోలీస్ శాఖ, శ్రీవిజ్ఞానవేదిక, కేజీఆర్ఎల్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఉమెన్ హెల్ప్ డెస్క్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఉమెన్ హెల్ప్ డెస్క్ మహిళల సంరక్షణ కోసం ఏర్పాటు చేశారని, నిర్భయంగా సమస్యలను తెలియజేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. సిఐ నాగరాజు మాట్లాడుతూ ఉమెన్ హెల్ప్ డెస్క్ పై అవగాహన కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలతో కలిసి విద్యాసంస్థలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, ఎస్సై, కేజీఆర్ఎల్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ నాచు శ్రీవల్లి పాల్గొన్నారు.

ఆకివీడులో..

ఆకివీడు: పోలీసులు ప్రజలను రక్షించడానికే ఉన్నారనే విషయం ప్రజలు గుర్తించాలని ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు సూచించారు. స్థానిక విద్యా వికాస్ కాలేజీ విద్యార్థినులకు పోలీస్ వ్యవస్థపై అవగాహనా కార్యక్రమం శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులకు ఏ విధంగా ఫిర్యాదు చేయాలి, కేసులు ఏ విధంగా నమోదు చేస్తారు, మహిళలకు పోలీసులు ఏ విధంగా రక్షణ కల్పిస్తారు అనే అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఎస్సై హనుమంతు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలి



భీమవరం 6వ వార్డులో పింఛన్ అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం భీమవరం పురపాలక సంఘం పరిధి 6వ వార్డు బొక్కా వారి పేటలో ప్రభుత్వం అందజేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పాల్గొని 10 మంది లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందజేశారు. ఈ సందర్భంగా ప్రతీ ఇంటికి వెళ్లి పింఛన్‌దారులను పలకరించి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పింఛన్‌లో ఎవరైనా సొమ్ములు అడుగుతున్నారా? అని ప్రశ్నించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పింఛన్ సొమ్ములో ఖర్చులు పోను కొంత మొత్తాన్ని పొదుపు చేసుకోవాలన్నారు. నూరు శాతం పింఛన్ పంపిణీని వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ సి.హెచ్ వెంకటేశ్వరరావు, వార్డు సెక్రటరీలు, ఏఎస్ఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలతో పశువుల సంరక్షణ



టీకాలు వేస్తున్న మండల పశువైద్యాధికారిణి కెల్లా భార్గవిసత్య

ఆకివీడు: వ్యాధి నిరోధక టీకాలతో పశువుల్ని సంరక్షించుకోవాలని మండల పశు వైద్యాధికారిణి కెల్లా భార్గవిసత్య విజ్ఞప్తి చేశారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా శనివారం మండలంలోని అయిభీమవరం గ్రామంలోని పశు వైద్య శాల వద్ద టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో గాలికుంటు వ్యాధి, బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నామని చెప్పారు. అయిభీమవరం గ్రామంలో గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు 15 పశువులకు, బూసెల్లా వ్యాధి నివారణ టీకాలు 15 పెయ్యి దూడలకు వేసినట్లు వివరించారు. సోమవారం అజ్జమూరు గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహిస్తామని, ఈ శిబిరాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి



ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ప్లాస్టిక్ నిషేధం సామాజిక బాధ్యత అని, అవగాహన చేసుకుని ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని పద్మావతి వేంకటేశ్వర స్వామి దేవస్థానం వంశపర్య చైర్మన్ మంతెన రామ్ కుమార్‌రాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం పురపాలక సంఘం ఆధ్వర్యంలో జె.పి రోడ్డులోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులకు ఉచితంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. 150 మంది భక్తులకు ఉచితంగా గుడ్డ సంచులను అందజేశామని కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తెలిపారు. కార్యక్రమంలో భట్టిప్రోలు శ్రీనివాసరావు, సమయమంతుల ధనలక్ష్మి, గుడి అర్చకులు, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



ఇంటర్ పరీక్షలు రాసేందుకు హాజరైన విద్యార్థులు.

ఆకివీడు: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని మూడు కేంద్రాల్లో 755 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 699 మంది హాజరవ్వగా, 56 మంది గైర్హాజరయ్యారని ఆయా కేంద్రాల చీఫ్ సూపర్‌వైజర్లు చెప్పారు. అలాగే పరీక్షా కేంద్రాల్లోని అన్ని రూముల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పరీక్షల నిర్వహణ తీరును ఉన్నతాధికారులు పర్యవేక్షించారని పేర్కొన్నారు.

ఉండిలో..

ఉండి: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. మండలంలో యండగండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 243 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 240 మంది హాజరైనట్లు కాలేజ్ ప్రిన్సిపల్ ఎన్.రమాప్రియ తెలిపారు.సోమవారం ఇంటర్ సెకండీయర్ సంస్కృతం,తెలుగు పరీక్ష జరగనుందని అధికారులు తెలిపారు.

బడ్జెట్‌లో మహిళలకు కేటాయింపులపై నిరసన



బడ్జెట్‌పై నిరసన తెలుపుతున్న ఐద్వా సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం కేటాయించిన బడ్జెట్‌లో మహిళలకు సంబంధించిన పథకాలకు నిధులు కేటాయించలేదని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ అన్నారు. శనివారం పట్టణంలోని వీవర్స్ కాలనీలో అఖిల భారత ప్రజా తంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ అమ్మఒడికి నిధులు పూర్తిగా కేటాయించలేదని అన్నారు. డ్వాక్రా మహిళలను మోసం చేశారని, ఉచిత బస్సు ఊసే లేదని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నో వాగ్దానాలు చేశారని వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఎస్ జయప్రభ, రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎస్.ఉదయ్‌కుమారి, కేతా ప్రభ, బి యశోద, జయ ప్రశాంతి పాల్గొన్నారు.

ఉపాధి పనుల ఆకస్మిక తనిఖీ



కూలీలకు సూచనలు చేస్తున్న అప్పారావు

పెనుగొండ: మండలంలోని దేవలో ఉపాధి పనుల్లో భాగంగా జరుగుతున్న మంచినీటి చెరువు పనులను డ్వామా పీడీ సీహెచ్ అప్పారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం పనులు జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించి పనుల నాణ్యతను పరిశీలించారు. ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశంలో సిబ్బంది దగ్గర ఉండి నిబంధనలు మేరకు పనులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఉపాధి కూలీలతో సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో టీఏ శంకర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాస గానామృత కల్యాణం



కాళ్ళకూరు వెంకన్న ఆలయంలో శ్రీనివాస గానామృత కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని కాళ్లకూరులో ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం యర్నగూడేనికి చెందిన కల్యాణ వెంకటేశ్వర భక్తమండలి ఆధ్వర్యంలో కాళ్లకూరు వాస్తవ్యులు గొట్టుముక్కల రామచంద్రరాజు దంపతులతో అంగరంగ వైభవంగా భక్తజనుల గోవిందనామస్మరణ మధ్య శ్రీనివాస గానామృత కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి తీర్థప్రసాదములు స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ ఎం.అరుణ్ కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మహిళ అదృశ్యంపై కేసు

నరసాపురం: మతిస్థిమితం లేని మహిళ అదృశ్యంశనివారం కేసు నమోదు చేసినట్టు టౌన్ ఎస్సై సీహెచ్ విజయలక్ష్మి చెప్పారు. పట్టణంలోని అరుంధతీపేటకు చెందిన ఉన్నమట్ల రాజు శనివారం ఉదయం మతిస్థిమితం లేని తన భార్య శృతికుమారితో కలసి స్టీమర్‌రోడ్డులోని అన్న క్యాంటీన్ వద్దకు వచ్చాడు. అయితే కొద్దిసేపటికి భార్య అక్కడ కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు.

నిరాశాజనకంగా రాష్ట్ర బడ్జెట్

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్ర బడ్జెట్ నిరాశాజనకంగా ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సీతారాం ప్రసాద్, ప్రజా కళాకారుడు చాంద్ బాషాలు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ పథకాలు బారెడు, కేటాయింపులు మూరెడు అన్న చందంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిధులు సంస్కృతిక రంగానికి ఏమాత్రం సరిపోవన్నారు. కూటమి ప్రభుత్వం కళాకారులను ఆదుకుంటుందని అనుకుంటే అన్యాయమే జరుగుతుందని వారు వాపోయారు.

ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): చిన్న, మధ్య తరహా పరిశ్రమల వ్యాపారులు ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఎంఎస్ఎంఈ సర్వే నిమిత్తం సంబంధిత శాఖల అధికారులతో కలిసి భీమవరం పట్టణంలోని ప్రకాశంచౌక్ లూథరన్ చర్చ్ సమీపంలో ఉన్న తరుణి బట్టల షాపును ఆకస్మికంగా సందర్శించారు. షాపు యజమానులతో మాట్లాడారు. ఎంఎస్ఎంఈ సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్న, మధ్య తరహా వ్యాపారులు ఎంఎస్ఎంఈ సర్వే వివరాలు నమోదు చేయుటకు గ్రామ వార్డు సచివాలయం సిబ్బంది వచ్చినప్పుడు పూర్తిగా సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఐపిఓ జె. శ్రీపతిరావు, తదితరులు ఉన్నారు.

8న దొడ్డనపూడిలో వైద్య శిబిరం

కాళ్ల: ఈ నెల 8న నిర్వహించే అంతర్జాతీయ మహిళా దినోత్సవం లో భాగంగా కాళ్ల మండలం దొడ్డనపూడి గ్రామంలో హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లో వైద్య ఆరోగ్యశాఖ,పోలీసు శాఖ వారి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు వైద్యులు సరాబు సునీల్ ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. దొడ్డనపూడి గ్రామంలో శనివారం ఓపెన్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో కాళ్ల ఎస్సై ఎన్.శ్రీనివాసరావు, వైద్యులు సునీల్ మాట్లాడుతూ మహిళల గురించి నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలు

నరసాపురం: రైల్వేస్టేషన్‌రోడ్డులోని మురుగుకాలువ వంతెన వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. టౌన్ ఎస్సై సీహెచ్ విజయలక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పిల్లిపేటకు చెందిన తీగిరెడ్డి చినసత్యనారాయణ తన ఆటోలో రాజోలు కిరాయికి వెళ్లి నరసాపురం వస్తున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని మురుగుకాలువ వంతెన వద్దకు వచ్చేసరికి ఎదురుగా పాలకొల్లు వైపు వేగంగా వెళ్తున్న మినీవ్యాన్ ఆటోను ఢీకొట్టింది. దీంతో చిన సత్యనారాయణకు స్వల్పగాయాలయ్యాయి. ఆ సమయంలో ఆటోలో ప్రయాణికులకు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆటో డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై వివరించారు.

ఆకుకూరలతో పౌష్టికాహారం

పెనుగొండ: ఆకుకూరలతో గర్భిణులకు, బాలింతలకు సమతుల్య పౌష్టికాహారం అందుతుందని, తద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం జరుగుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ ఎ.కృష్ణకుమారి అన్నారు. శనివారం మునమర్ర అంగన్‌వాడీ కేంద్రం వద్ద పండించిన ఆకుకూరలను పోషణ వాటికలో భాగంగా గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేశారు. అనంతరం పెనుగొండ యర్రా నారాయణ స్వామి కాలనీలో భేటీ బచావో–భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజరు బి.సుజాత, టీచర్ వై.హేమ, వీవీవీ నాగలక్ష్మీ, జి.మణి పాల్గొన్నారు.

దుర్గా లక్ష్మణేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరంలో ఉన్న శ్రీదుర్గా లక్ష్మణేశ్వర స్వామి వారి దేవాలయంలోని హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. భీమవరం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వర్ధినీడి వెంకటేశ్వరరావు సమక్షంలో శివరాత్రి తర్వాత ఆలయ హుండీని తెరిచి లెక్కించారు. రూ.3,61,401లు హుండీ ఆదాయంగా వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆర్‌వీవీఎస్ రామచంద్రకుమార్, మొగల్తూరు మండల కార్యనిర్వాహణాధికారి బి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.